
కబ్జా కోరల్లో బీసీ కాలనీ ప్లాట్లు

- 1987లో 122 మందికి ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ
- ఆ భూములు తమవంటూ కబ్జా చేసిన కొందరు
- బెదిరింపులకు పాల్పడుతూ డబ్బుల వసూళ్లు, ప్లాట్ల విక్రయాలు
- న్యాయం చేయాలంటూ బీసీ కాలనీవాసుల వేడుకోలు



కమలాపూర్‌లోని బీసీ కాలనీ



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు (ఫైల్)

కమలాపూర్ : కమలాపూర్ బీసీ కాలనీలోని కొన్ని ప్లాట్లు కబ్జాదారుల కోరల్లో చిక్కుకున్నాయి. పద్మశాలి కులస్తులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఆ భూములు తమవంటూ కొందరు కబ్జా చేసి బెదిరింపులకు దిగి డబ్బులు వసూలు చేయడంతోపాటు ప్లాట్ల విక్రయాలకు పాల్పడుతూ కొన్ని ప్లాట్లలో నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ మేరకు బీసీ కాలనీ వాసులు ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి కబ్జాదారుల బారినుంచి తమ ఇళ్ల స్థలాలను కాపాడి తమకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని వేడుకున్నారు.

బీసీ కాలనీకి 14.26 ఎకరాలు కేటాయింపు

కమలాపూర్‌లోని 895 సర్వే నంబరులో బీసీ కాలనీ (పద్మశాలి కులస్తులు) కోసం 1987లో 14.26 ఎకరాలు కేటాయించి అందులో 122 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. తమకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో పలువురు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటుండగా కొందరు మాత్రం జీవనోపాధి కోసం మహారాష్ట్ర, గుజరాత్, షోలాపూర్, సిరిసిల్ల వంటి ప్రాంతాలకు వలస వెళ్లి ఇళ్లు నిర్మించుకోని కారణంగా ఆ ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. కొన్నేళ్లుగా భూముల విలువ పెరగడంతో ఖాళీగా ఉన్న ఈ ప్లాట్లపై కన్నేసిన కొందరు వాటిని కబ్జా చేశారు. తమకు కేటాయించిన పట్టా భూముల్లో (ప్లాట్లలో) ఇటీవల కాలంలో ఇళ్లు నిర్మించుకుంటున్న పద్మశాలీలపై దౌర్జన్యాలకు దిగుతూ ఆ ప్లాట్లు తమవని బెదిరింపులకు దిగి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్లాట్ల దారులు ఆరోపిస్తున్నారు. కొన్ని ప్లాట్లు విక్రయించి మరికొన్నిట్లో నిర్మాణాలు చేపట్టారని చెబుతున్నారు.

ఇల్లు కట్టుకోకుండా అడ్డుకున్నారు



నా భర్త భాస్కర్ కొన్నేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేక ఇన్నాళ్లు ఇల్లు కట్టుకోలేక వేరే ఊర్ల కిరాయికి ఉన్నం. మాకిచ్చిన పట్టా స్థలంలో ఇప్పుడు ఇల్లు కట్టుకుందామని వస్తే ఇల్లు కట్టుకోకుండా అడ్డుకున్నారు. మా పట్టా స్థలం మాకు ఇప్పించి న్యాయం చేయండి.

- కోడం లావణ్య

ఇల్లు కడితే కూల్చేస్తామని బెదిరిస్తున్నారు



మా మామ బైరి రాజమౌళి పేరు మీద మాకు ప్లాట్ కేటాయించారు. ఆ ప్లాట్‌లో ఇల్లు కట్టుకుందామని వెళ్తే ఒకతను కొందరితో వచ్చి ఇది నా భూమి, ఇక్కడ ఇల్లు కట్టొద్దని, కడితే కూల్చేస్తానని బెదిరించాడు. అధికారులకు చెప్పినా ఫలితం లేకపోగా ఆరేళ్లుగా ఇబ్బంది పడుతానం.

- బేరి దివ్య

ఉద్యోగ విరమణ సహజం

- ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



రాంకిషన్‌రాజు దంపతులను సన్మానిస్తున్న ఆర్జేడీ

కమలాపూర్ : ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని, ఉద్యోగ విరమణ పొందిన రాంకిషన్ రాజు తమ శేష జీవితం విద్యాభివృద్ధికి కృషి చేయాలని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, కమలాపూర్ ఎంఈఓ ఎర్ర రాంకిషన్ రాజు ఉద్యోగ విరమణ వీడ్కోలు సన్మాన కార్యక్రమం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. ఆయన హాజరైన మాట్లాడుతూ.. రాంకిషన్‌రాజు హనుమకొండ జిల్లాలో సుమారు 11 ఏళ్ల పాటు విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. విద్యా శాఖ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. 37 ఏళ్ల సర్వీసులో రాంకిషన్‌రాజు చేసిన సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆర్జేడీతో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు రాంకిషన్‌రాజు దంపతులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రంగనాథ్, ఎంఎన్ఓ శ్రీధర్, ఆర్‌యూపీపీ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా, టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యాయ సంఘాల నేతలు తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



ఎల్కతుర్తి : పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌లు (బీఆర్‌ఎస్) నాయకులు బుధవారం సచివాలయం లముట్టడికి పిలుపు నిచ్చిన నేపథ్యంలో స్థానిక పోలీస్‌లు ముందస్తు చర్యలు చేపట్టారు. మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు (మాజీ సర్పంచ్‌లను) ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. అప్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి పరుస్తే బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం తాత్సరం వహిస్తుండడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టైన వారిలో మాజీ సర్పంచ్‌లు కుర్ర సాంబమూర్తి, బొయినపల్లి దేవేందర్ రావు, నాగేశ్వర్ ఉన్నారు.

దామెర : పెడింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి డిమాండ్ చేశారు. చలో సెక్రెటరీయట్ కార్యక్రమం సందర్భంగా శ్రీరాంరెడ్డిని బుధవారం ఉదయం ముందస్తు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12 నెలల నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. హైదరాబద్‌లోని సెక్రెటరీయేట్ ఎదుట శాంతియుత నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం సరికాదని అన్నారు. అక్రమ అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని అన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాలకు సమన్యాయం



కమలాపూర్ : సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఝాన్సీరాణి

దామెర : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్నివర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన పూర్తిచేసిన సందర్భంగా మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు పలువురు మంత్రుల చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. బీసీలకు చట్ట సభల్లో 42 శాతం, ఎస్సీ వర్గీకరణ బిల్లును క్యాబినెట్, అసెంబ్లీలో ఆమోదం తెలిపిందని అన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని సాహసం చేసి అన్ని వర్గాలకు అండగా నిలిచే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, సీనియర్ నాయకులు పోశయ్య, అనిల్‌రెడ్డి, రవి, రవీందర్, రాంచందర్, వెంకన్న, సాంబయ్య, సుధాకర్, విజేందర్, కుమార్, రవి పాల్గొన్నారు.

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణ నివేదికను రాష్ట్ర కేబినెట్, అసెంబ్లీ ఆమోదించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకులతో కలిసి ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీరాణి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దళిత నాయకుడు పోడేటి భిక్షపతి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి దళితుల పక్షపాతి అన్నారు. ఇందిరమ్మ కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ దళితుల అభ్యున్నతి కోసం పాటుపడుతోందన్నారు. దళితులకు అండగా ఉంటున్న కాంగ్రెస్ పార్టీకి దళితులు కూడా అండగా ఉండాలన్నారు. ఏఎంసీ డైరెక్టర్లు జనగాని శివకృష్ణగౌడ్, శ్రీధర్‌గౌడ్, తిరుపతి, నాయకులు రమేశ్‌గౌడ్, శ్రీనివాసరావు, రాంచంద్రం, పర్శరాములుగౌడ్, రఘుపతి, శ్రీకాంత్, రోహిత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత చరిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్ అన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత చేపట్టిన సందర్భంగా మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పర్వతగిరి రాజు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు పరికిరాల వాసు, బరుపట్ల కిరీటి, కక్కెర్ల రాజు, యూత్ అధ్యక్షుడు తనుగుల సందీప్, బయ్య కుమారస్వామి, అలువాల రవి, తిరుపతి పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన 'చల్లా'



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం కేసీఆర్ ఫామ్‌హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ పరిస్థితులను కేసీఆర్‌కు తెలిపినట్లు పేర్కొన్నారు. పలు అంశాలను ఆయన కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



ఆత్మకూరు : మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



వేలేరు : ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్కతుర్తి : పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద, మధ్యతరగతి ప్రజలకు రూ.12 లక్షలు వార్షిక ఆదాయంపై పన్ను రద్దు చేస్తూ ప్రకటించడాన్ని హర్షిస్తూ బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, పృథ్వీరాజ్, నారాయణ, సదానందం, భిక్షపతి, వేణు, ప్రదీప్‌రెడ్డి, లక్కిరెడ్డి, రాజేందర్, సంపత్, కిష్టయ్య, శంకరయ్య, రమేశ్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : పేద, మధ్యతరగతి ప్రజల అభివృద్ధికి అణుగుణంగా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేపీ నియోజకవర్గ నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పైడి, నాయకులు వేణు, రవి, సత్యనారాయణ, బుచ్చిరెడ్డి, ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : పార్లమెంట్‌లో రూ.51 లక్షల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేపుల రాజు యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీజేపీ నాయకులు కీర్తి సురేశ్, కిరణ్, శివాజీ, నాగరాజు, రాజేశ్ పాల్గొన్నారు.

కళాకారులకు డప్పుల పంపిణీ



కమలాపూర్ : పుల్లా ఫ్యామిలీస్ చారిటబుల్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని డప్పు కళాకారులకు బుధవారం డప్పులు పంపిణీ చేశారు. 300 మంది డప్పు కళాకారులకు డప్పులు అందజేసిన అనంతరం అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పులతో ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ వైస్ చైర్మన్ పుల్లా శ్రీనివాస్, రిటైర్ ఏసీపీ పుల్లా సంజీవ్, ప్రముఖ గాయకుడు మిట్టపెల్లి సురేందర్, నాయకులు కొంరయ్య, కిషన్, శ్రీనివాస్, వినోద్‌కుమార్, శోభన్, కుమార్, రాజేశ్, రాజు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

ఉప్పల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలి

- స్థానికుల ఆందోళన



ఉప్పల్‌లో ధర్నా, రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్‌లోని కన్నూరు క్రాస్ రోడ్డు వద్ద అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉప్పల్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న ఉప్పులపల్లి, భీంపల్లి, కన్నూరు, కొత్తపల్లి, గుండేడు, దేశరాజుపల్లి, గుంటూరుపల్లి, కానిపర్తి, శంభునిపల్లి, హుజూరాబాద్ మండలంలోని ధర్మరాజుపల్లి తదితర గ్రామాలను కలుపుకొని ఉప్పల్‌ను మండలంగా ఏర్పాటు చేయాలన్నారు. ఉప్పల్‌ను మండలం చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, రైల్వే స్టేషన్‌తో పాటు పీహెచ్‌సీ, రెండు ప్రభుత్వ పాఠశాలలు, పశు వైద్యశాల వంటివి ఉన్నాయన్నారు. మండలంగా ఏర్పాటు చేస్తే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఉప్పల్, చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఉప్పల్‌ను వెంటనే మండలంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమాచారం అందుకున్న పోలీస్‌లు అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు నవీన్‌కుమార్, సంపత్‌రావు, దేవేందర్‌రావు, నాయకులు క్రాంతికుమార్, రాజు, రాణాప్రతాప్, రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, రాంచంద్రం, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని గొల్లవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన హైస్కూల్ హెచ్‌ఎం నిర్మల మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, ఎంచుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు కష్టపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పెండెం రాజు, ఉపాధ్యాయులు భిక్షపతి, నరసింహస్వామి, కిరణ్‌కుమార్, వసంత పాల్గొన్నారు.

అమరుల స్మారకస్మృతి కేంద్రంగా తీర్చిదిద్దాలి

- జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న కవ్వ లక్ష్మారెడ్డి

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరును అమరుల స్మారక స్మృతి కేంద్రంగా తీర్చిదిద్దాలని హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముల్కనూరులో గల తెలంగాణ అమరుల స్థూపాన్ని అమరుల స్మారక స్మృతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి, అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక రాష్ట్రం కోసం నూరేళ్ల జీవితాలను తృణప్రాయంగా త్యాగం చేశారని, వారి ప్రాణత్యాగం, ఉద్యమకారుల దృఢ సంకల్పం, సోనియాగాంధీ దాతృత్వంతో స్వరాష్ట్రం సాకారమైందని గుర్తుచేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అంబేడ్కర్ విగ్రహం, అమరుల స్తూపం గల ప్రాంతాన్ని అన్ని వసతులతో కూడిన జంక్షన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. ఆర్టికల్ 3 ద్వారా రాష్ట్ర ఏర్పాటుకు వలస పాలకుల అడ్డంకులను నిలువరించి ఇంద్రవెల్లి, కోరెగాంలో గల స్తూపాల మాదిరిగా తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణికుంట్ల భిక్షపతి, కండె సుధాకర్, కుమారస్వామి, ప్రభుదాస్, కరుణాకర్, సంపత్, ప్రభాస్ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపు ఎదుట రైతుల నిరసన



షాపు ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

శాయంపేట : తమ పంటచేను నాశనానికి కారణమైన పురుగుల మందు ఇచ్చి తమను పట్టించుకోవడంలేదని మండల కేంద్రంలోని భాస్కరా ఫర్టిలైజర్ ఎదుట బుధవారం మండల కేంద్రానికి చెందిన రైతులు చిట్టిరెడ్డి మహేందర్‌రెడ్డి, దైనంపల్లి కుమారస్వామి, నత్తి మహేందర్ నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. తమ వ్యవసాయ భూమిలో మొక్కజొన్న పంట సాగు చేశామని తెలిపారు. చేనులో గడ్డి బాగా పెరగడంతో మండల కేంద్రంలోని భాస్కరా ఫర్టిలైజర్‌కు వెళ్లినట్లు చెప్పారు. గడ్డి నివారణ కోసం ఓ కంపెనీకి చెందిన పురుగుల మందును భాస్కరా ఫర్టిలైజర్ యాజమాని సర్వేశం ఇచ్చినట్లు తెలిపారు. పురుగుల మందును మొక్కజొన్న చేనులో పిచికారీ చేయగా మొక్కజొన్న పంట సైతం దెబ్బతినడంతో ఫర్టిలైజర్ షాపు యాజమాని సర్వేశంను ప్రశ్నించినట్లు తెలిపారు. అతడు పంట చేనును పరిశీలించి కంపెనీకి తెలియపరిచాడని అన్నారు. కంపెనీ సిబ్బంది కూడా పంటను పరిశీలించి తమకు న్యాయం చేస్తామని చెప్పి ఇప్పటివరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సంఘటన స్థలాన్ని ఎస్సై జక్కుల పరమేశ్ చేరుకొని రైతులతో వెళ్లి పంటను పరిశీలించారు. రైతులకు తగిన న్యాయం చేస్తామని ఎస్సై హామీ ఇచ్చారు. ఈ మేరకు రైతులు ఆందోళన విరమించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఫైర్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కమలాపూర్ : అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హనుమకొండ అగ్నిమాపక కేంద్రం అధికారి దయాకర్ సూచించారు. మండల కేంద్రంలోని ఎల్‌పీజీ ప్లాంట్ వద్ద హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, మకీన్ ఎనర్జీ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై లెవెల్–3 ఫైర్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో, ఇతర ప్రాంతాల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి, ప్రమాదాలను ఎలా నివారించాలనే దానిపై అవగాహన కల్పించారు. ఒక విభాగంతో మరొక విభాగం ఎలా సమన్వయపర్చుకుని సహకరించుకోవాలి, సమాచారం ఎలా అందించాలి, భద్రత నియమాలు ఎలా పాటించాలనే తదితర అంశాలపై ఫైర్ డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. హెచ్‌పీసీఎల్ ప్లాంట్ డీజీఎం, రీజినల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మెదూరి, పరిశ్రమల శాఖ జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, శివరామకృష్ణ, వెంకట్రాంరెడ్డి, ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ శోభారాణి, ఆర్ఐ సమ్మయ్య, శ్రీనివాస్, మకీన్ ఎనర్జీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వైద్యులు, వైద్య సిబ్బంది, డ్రైవర్లు కార్మికులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

ఎల్కతుర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఎస్ఎమ్ఆర్ గార్డెన్, భీమదేవపల్లి మండలం ముల్కనూరులోని వెంకటసాయి గార్డెన్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు పిట్టల మహేందర్, మండల సురేందర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ఉపేందర్‌కు 108 స్టార్ ఈఎంటీ అవార్డు



కమలాపూర్ : మండలంలోని 108 అంబులెన్స్‌లో ఈఎంటీగా విధులు నిర్వహిస్తున్న బండ ఉపేందర్ 108 స్టార్ ఈఎంటీగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈఎంటీగా అత్యుత్తమ సేవలు అందించిన ఆయనకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ పాటి శివకుమార్, హనుమకొండ జిల్లా మేనేజర్ లక్ష్మణ్ బుధవారం అవార్డును ప్రదానం చేశారు. తన సేవలను గుర్తించి అవార్డు అందించిన సందర్భంగా ఉపేందర్ జిల్లా ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్లమ్మ గుడిలో చోరీ

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి గుడిలో చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. బంగారం, వెండి చోరీ జరిగినట్లు తెలిసింది. ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గట్లకానిపర్తిలోని తాటి వనంలో గల ఎల్లమ్మ తల్లి గుడిలో అదే గ్రామానికి చెందిన పోషాల మధుసూదన్ పూజారిగా పని చేస్తున్నాడు. మధుసూదన్ గత నెల 28వ తేదీన గుడికి తాళం వేసి హైదరాబాద్‌లో తన సోదరుడి నూతన గృహ ప్రవేశానికి వెళ్లాడు. బుధవారం అమ్మవారికి పూజలు చేసేందుకు రోజుమాదిరిగానే ఉదయం గుడికి వచ్చాడు. ఈ క్రమంలో గుడికి వేసిన తాళం లేకపోవడంతో పక్కనేఉన్న ముంజాల సదానందానికి తెలిపాడు. ఇద్దరు కలిసి ఎల్లమ్మ తల్లి గుడి లోపలికి వెళ్లి చూడగా అమ్మవారి రెండు బంగారు పుస్తెలు, వెండి కండ్లు, వెండి ముక్కుపుడక కనిపించలేదు. వాటివిలువ రూ. 20వేలు ఉంటుందని, గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మధుసూదన్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఆరోపణలు సరికాదు

ఆత్మకూరు : అక్కంపేట గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినట్లు బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం సరికాదని అక్కంపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. అక్కంపేటలో బుధవారం కాంగ్రెస్ నాయకులు హంషాల్, కృష్ణ మాట్లాడుతూ.. గ్రామంలో అభివృద్ధి పనుల కోసం మట్టిని వినియోగించినట్లు తెలిపారు. దీన్ని బీఆర్‌ఎస్ నాయకులు వక్రీకరించడం అవివేకానికి నిదర్శమని అన్నారు.

ఈటలపై ఆరోపణలు మానుకోవాలి

కమలాపూర్ : మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలని హుజూరాబాద్ నియోజకవర్గ ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు జేరిపోతుల రమేశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈటల రాజేందర్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోన్ చేశాడని వస్తున్న పుకార్లను ఆయన ఖండించారు. నిఖార్సైన ఉద్యమకారుడిపై ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించబోమని తెలిపారు. ఈటలకు రాష్ట్ర వ్యాప్తంగా పెరుగుతున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుట్ర పన్ని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తునాయని పేర్కొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



దామెర : మండలంలోని కోగిల్వాయికి చెందిన రేగుల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న ఆయనతోపాటు 10 వరగతి వరకు చదివిన బాల్యమిత్రులు బుధవారం శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10,000 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శ్రీనివాస్ గౌడ్, గడబోయిన రమేశ్, దివికేశవాచార్యులు, గడ్డం నిరంజన్, పాలకుర్తి అశోక్‌గౌడ్, వల్లంపట్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం



సదానందం (ఫైల్)

వరంగల్ : ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరి ధిలోని రెడ్డిపాలెం జంక్షన్ వద్ద బుధవారం సా యంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముస్త్యాలపల్లికి చెందిన సిద్దోజు సదానందం(55) అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ రాఘవేందర్ తెలి పారు. బుధవారం గొర్రెకుంట నుంచి కొత్తపేట వైపు వెళ్తున్న లారీ ముస్త్యాలపల్లి నుంచి కాశిబుగ్గ వైపు వెళ్తున్న మోటార్ సైకిల్‌ని ఢీకొట్టిందన్నారు. ఈ ఘటనలో సదానందం తలకు బలమైన గా యాలు కాగా అక్కడికక్కడే మరణించినట్లు తెలి పారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.